తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

- వారికి మద్దతునిస్తాం
- పెట్టుబడులకూ భద్రతనిస్తాం
- భవిష్యత్ తరాలకు అవకాశాలను సృష్టించాలనేది మా ఆలోచన
- పిఎఎఫ్ఐ 12వ వార్షిక సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"తెలంగాణలో పెట్టుబడులకు ఆహ్వానం పలుకుతున్నాం. పెట్టుబడిదారులకు మద్దతుగా నిలుస్తాం. ఇక్కడ పెట్టే పెట్టుబడులకూ భద్రత ఉంటుంది. పెట్టుబడులు పెట్టి తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాడిక్కడ పబ్లిక్ ఎఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా (పిఎఎఫ్ఐ) 12వ వార్షిక సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా డ్రగ్స్ సమస్య ఉన్నా, తాము డ్రగ్స్‌ను కంట్రోల్ చేశామని అన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని తెలిపారు. పరిపాలన చేసేందుకు రాజకీయ సంకల్పం ఎంతో అవసరమని అన్నారు. భవిష్యత్ తరాలకు అవకాశాలను సృష్టించాలనేది మా ఆలోచన అని చెప్పారు. దేశంలో యంగెస్ట్ స్టేట్ (కొత్త రాష్ట్రం) తెలంగాణ రాష్ట్రం అని తెలిపారు. కొత్త రాష్ట్రమైన తెలంగాణకు, హైదరాబాద్‌కు ఘనమైన చరిత్ర ఉందని, తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి తెలంగాణ విజన్ డాక్యుమెంట్-2047 రూపొందించామని అన్నారు. 2025 డిసెంబర్ 9న తెలంగాణ విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తామని తెలిపారు. తెలంగాణను కోర్ అర్బన్, సెమీ అర్బన్,


పిఎఎఫ్ఐ సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి

రూరల్‌గా విభజించామని, కోర్ అర్బన్ ఏరియాలో కోటి మంది నివసిస్తున్నారని అన్నారు. ఇక్కడ కాలుష్యకారక పరిశ్రమలను నగరం వెలుపలికి తరలిస్తున్నామని, సెమీ అర్బన్ ఏరియాను తయారీ రంగం జోన్‌గా (మాన్యుఫాక్చర్) నిర్ణయించామని చెప్పారు. తెలంగాణలో అభివృద్ధికి తగినట్టు 70 కిలోమీటర్లు ఉన్న మెట్రోను 150 కిలోమీటర్లు పొడిగించాలని నిర్ణయించామన్నారు. ప్రస్తుతం ఐదు లక్షల మంది మెట్రోలో పయనిస్తున్నారని, దానిని 15 లక్షలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు.

సబర్మతీ తీరంలా మూసీని మారుస్తామనీ, అందుకు మూసీ పునరుజ్జీవంపై దృష్టి సారించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం చేపడుతున్నామని, 2027 నాటికి హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ వాహనాలే ఎక్కువగా ఉండనున్నాయని చెప్పారు. అందుకే ఇవిలకు రాయితీలు ప్రకటించామని తెలిపారు. రాష్ట్ర అవసరాలకు తగినట్టు రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం జరుగుతుందన్నారు. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని, విమానాశ్రయం నుంచి భారత్ ఫ్యూచర్ సిటీకి అనుసంధానత కల్పిస్తామని అన్నారు. తెలంగాణలో సేంద్రీయ పంటలు పండుతున్నాయని తెలిపారు. యువతకు జ్ఞానంతో పాటు నైపుణ్యం అవసరమని, వారిలో ఆ నైపుణ్యాలు పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని అన్నారు.

మహాత్మాగాంధీ యంగ్ ఇండియా స్ఫూర్తిని అనుసరిస్తున్నామనీ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో చదువుకున్న వాళ్లకు మంచి ఉద్యోగాలు వస్తాయని సిఎం పేర్కొన్నారు. స్పోర్ట్స్‌లో దక్షిణ కొరియా వంటి చిన్న దేశాలకు వచ్చే మెడల్స్ చూస్తే ఆశ్చర్యం కలుగుతోందని, ఒలింపిక్స్ పతకాల సాధనే లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని అన్నారు. తెలంగాణ భూపరివేష్టిత రాష్ట్రం (ల్యాండ్ లక్డ్) కావడంతో ఓడ రేవు లేదని, మచిలీపట్నం ఓడరేవు అనుసంధానా నికి ఫ్యూచర్ సిటీ నుంచి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే.. దానికి సమాంతరంగా రైల్వే లైన్ మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరుతున్నామని వివరించారు. బల్క్ డ్రగ్స్ ఉత్పత్తిలో 40 శాతం తెలంగాణే చేస్తోందని, వ్యాక్సిన్ల తయారీలో హైదరాబాద్ ముందు వరుసలో ఉందని పేర్కొన్నారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలతో అమెరికాకే ఎక్కువగా నష్టమని సిఎం అన్నారు. ట్రంప్ ఒకరోజు మోడీ నా ఫ్రెండ్ అంటారని, మరో రోజు అడ్డగోలుగా సుంకాలు వేస్తారని విమర్శించారు. తెలంగాణలోనూ ఒక ట్రంప్ ఉండేవారని, ఆయనను తెలంగాణ ప్రజలు పక్కన పెట్టారని కెసిఆర్‌ను ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. రాత్రి వచ్చిన ఆలోచనను తెల్లారే అమలు చేయడం సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు.

సిఎంతో న్యూజెర్సీ గవర్నర్ భేటీ

ఢిల్లీలో సిఎం ఎ.రేవంత్ రెడ్డితో న్యూజెర్సీ గవర్నర్ పిలిప్ డి.ముర్ఫీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విద్యా, గ్రీన్ ఎనర్జీ, ఎంటర్‌టైన్‌మెంట్ (సినిమా రంగం), మౌలిక వసతులు (మెట్రో... పట్టణ రవాణా), మూసీ రివర్ ఫ్రంట్ తదితర అంశాలపై వారు చర్చించారు. తెలంగాణ విజన్ 2047 సాధనలో తమ ప్రభుత్వం చేస్తున్న కృషిని సిఎం న్యూజెర్సీ గవర్నర్‌కు వివరించారు. అదే విధంగా ఐటీ, ఫార్మా రంగంలో తెలంగాణ రాష్ట్ర ప్రాధాన్యాన్ని సిఎం తెలియజేశారు. భేటీలో గవర్నర్ సతీమణితో పాటు న్యూజెర్సీ ప్రతినిధులు పాల్గొన్నారు. అదే విధంగా సీఎంతో అమెజాన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ చేతన్ కృష్ణస్వామి భేటీ అయ్యారు



ప్రాధాన్యతా క్రమంలో పనులు చేయండి

- మౌలిక, వసతుల కల్పన సబ్‌కమిటీ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అభివృద్ధి పనులను అధికారులు శాఖల వారీగా ప్రాధాన్యత క్రమంలో గుర్తించాలని డిప్యూటీ సిఎం, మౌలిక, వసతుల కల్పన సబ్ కమిటీ చైర్మెన్ మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన మంత్రుల సబ్‌కమిటీలో భట్టితో పాటు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. 1:3 శాతం చొప్పున ప్రతిపాదనలు తీసుకురావాలనీ, సంవత్సరాల వారీగా ప్రాధాన్యత క్రమంలో విభజన చేయాలని సూచించారు. ఆ మేరకు అన్ని శాఖల ప్రధాన కార్యదర్శులు వారంలోగా పూర్తిస్థాయి ప్రతిపాదనలతో సమావేశానికి రావాలని ఆదేశించారు. న్యామ్ రోడ్ల పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖ అధికారులకు సూచించారు. ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, పోలీస్ శాఖలో వచ్చిన ప్రతిపాదనలను సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, పంచాయతీరాజ్ శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, వివిధ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

పులిగుండాల జ్యూట్ బ్యాగులు ఆదర్శం

- ఖమ్మం అటవీ శాఖ ఉన్నతాధికారులను ప్రశంసించిన మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లాలోని పులిగుండాల ఎకో టూరిజం కేంద్రంలో జ్యూట్ బ్యాగుల వాడకాన్ని తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అభినందించారు. రాష్ట్రంలోని అన్ని ఎకో టూరిజం సెంటర్లు ఈ పద్ధతిని అనుసరించాలని ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఖమ్మం జిల్లా నుంచి వచ్చిన అధికారులు, పలు సంస్థల బృందంతో మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి జ్యూట్ బ్యాగులు వాడాలనే ఖమ్మం జిల్లా అధికారుల ప్రయత్నాన్ని ప్రశంసించారు. తెలంగాణ వన జీవధార అభియాన్ (టివిజెఎ), వన సంరక్షణ సమితులకు అటవీ సంరక్షణతో పాటు సుస్థిర జీవనోపాధిని కల్పించడమే లక్ష్యమని చెప్పారు. ఈ పథకంలో హస్తకళలు, నర్సరీ నిర్వహణ, ఎకో టూరిజం, తేనెటీగల పెంపకం వంటి శిక్షణలు, అటవీ ఉత్పత్తులకు విలువ ఆధారిత మార్కెట్ వ్యవస్థలు, హర్బల్ తోటలు వంటి అటవీ మౌలిక సదుపాయాల కల్పన జరగడం హర్షనీయం అన్నారు. క్యాంపా, టిజి ఎఫ్‌డిసి, సిఎస్ఆర్ నిధులు, కేంద్ర పథకాలతో ఈ ప్రాజెక్ట్ అమలవుతుందనీ, వచ్చే మూడేండ్లలో ఖమ్మం జిల్లాలో ఐదొందల మందికి పైగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు తెలిపారు. కాగా, స్థానికంగా పులిగుండాలలో చేపట్టిన జ్యూట్ బ్యాగుల వినియోగం వంటి చర్యలు ఎకో టూరిజాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు, గ్రామీణ అభివృద్ధికి ఈ చర్యలు ఉపయోగపడతాయని మంత్రి సురేఖ అభిప్రాయపడ్డారు.



నాలాలను కబ్జా పెడితే కఠిన చర్యలు

- హైడ్రా కమిషనర్ రంగనాథ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరద నీరు సాఫీగా ప్రవహించకుండా అడ్డుకట్ట వేస్తూ నాలాలను కబ్జా పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. హైదారబాద్‌లో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్ అశోక్‌నగర్ స్ట్రీట్ నెంబర్ ఆరులోని, హుస్సేన్‌సాగర్ నాలాకు ఆనుకొని ఉన్న శ్రీసత్యనారాయణ స్వామి దేవాలయం ప్రహరీ కూలడంతో వరద నీరు కాలనీ, దేవాలయాన్ని ముంచెత్తింది. దాంతో కార్పొరేటర్ ఎ పావని వినయ్‌కుమార్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ శుక్రవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులురెడ్డి, ఇంజనీరింగ్, ఇరిగేషన్ అధికారులు, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ వినయ్ కుమార్ సంబంధిత అధికారులతో కలిసి సమస్యాత్మక ప్రదేశాన్ని సందర్శించారు. దేవాలయం గోడను ఇరిగేషన్ సిబ్బంది ద్వారా వెంటనే నిర్మించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం స్థానికుల ఫిర్యాదు మేరకు.. సమీపంలో వరద నీరు వెళ్లకుండా అడ్డుగా ఉన్న అపార్ట్‌మెంట్ అక్రమ నిర్మాణాన్ని హైడ్రా కమిషనర్ పరిశీలించారు. దీనిపై వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని, వరద ముంపును కట్టడి చేసేందుకు తక్షణ ప్రత్యేక చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. బీజేపీ డివిజన్ అధ్యక్షులు వి నవీన్ కుమార్, కాలనీవాసులు కృష్ణయ్య, కృష్ణమాచారి, మెహర్ జి రామకృష్ణ, కిరణ్, వీరప్రసాద్, భారతి తదితరులు పాల్గొన్నారు.



25న యథావిధిగా చలో సచివాలయం

- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిర్దిష్టమైన ఉత్తర్వులు రానందున ఈ నెల 25న చలో సచివాలయం కార్యక్రమం యథావిధిగా ఉంటుందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు కె సునీత, ప్రధాన కార్యదర్శి పి జయలక్ష్మి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆ యూనియన్ బృందంతో ప్రజావాణి నోడల్ అధికారి దివ్యదేవరాజన్ చర్చలు జరిపారు. తదనంతరం ఐసిడిఎస్ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్‌తో సచివాలయంలో రెండో దఫా చర్చలు జరిగాయి. ప్రీ ప్రైమరీ, పిఎం శ్రీ విద్యను అంగన్వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని విద్యా బోధనా బాధ్యత అంగన్వాడి ఉద్యోగులకే అప్పగింత, ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు, వేతనాల పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, మినీ టీచర్స్ పెండింగ్ ఏరియర్స్, తదితర డిమాండ్లను నెరవేర్చడంపై రాష్ట్ర సర్కారు నుంచి స్పష్టమైన హామీ లభించలేదని సునీత, జయలక్ష్మి తెలిపారు. చర్చల్లో తమ డిమాండ్లపై నిర్దిష్ట ఉత్తర్వులు రాకపోవడంతో 25న తలపెట్టిన చలో సెక్రటేరియట్ యథావిధిగా ఉంటుందని ప్రకటించారు. ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇ వెంకటమ్మ, కె సమ్మక్క రాష్ట్ర నాయకులు సిహెచ్.రమా కుమారి, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ తీరుమారాలి

- మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సునీతా రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సొంత చెల్లిను ఇంటి నుంచి బయటకు పంపించిన చరిత్ర కెటిఆర్‌కు ఉందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సునీతారావు విమర్శించారు. ఆయన ఆడబిడ్డల గురించి సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని ఆమె ఎద్దేవా చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బతుకమ్మ పాట విడుదల చేసే ముందుకు ఆడబిడ్డలను గౌరవించడం నేర్చుకోవాలని సూచించారు. బతుకమ్మ కుంటను ఆక్రమించింది బిఆర్ఎస్ నేతలు కాదా? అని ప్రశ్నించారు. బతుకమ్మ కుంటలో బతుకమ్మ ఆడేందుకు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి రావాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గురించి మాట్లాడే అర్హత బిఆర్ఎస్ నేతలకు లేదని, ఇప్పటికైనా తీరుమార్చుకోవాలని ఆమె స్పష్టం చేశారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కమిషన్ చైర్మన్ దీపక్‌జాన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన క్రైస్తవ మైనారిటీలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కమిషన్ చైర్మన్ దీపక్ జాన్ అన్నారు. క్రైస్తవ మైనారిటీల సమస్యలపై నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఆయా నియోజకవర్గాల్లో చర్చి నిర్మాణాల కోసం స్థలాల కేటాయింపు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, క్రైస్తవుల కుల, వివాహ ధ్రువీకరణ పత్రాల మంజూరు, సమాధుల కోసం స్థలాల కేటాయింపు.. ఇతర అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.. క్రైస్తవ మైనారిటీల సమస్యల పరిష్కారానికి తగిన సిఫారసులు ప్రభుత్వానికి పంపుతామన్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ.. క్రైస్తవ మైనార్టీల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన క్రైస్తవులకు అందేలా సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చర్చి, కమ్యూనిటీ హాల్ నిర్మాణ అనుమతుల విషయంలో అవసరమైన చర్యలు చేపడతామన్నారు. అంతకుముందు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్లు తమ సమస్యలను కమిషన్ చైర్మన్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్, చైర్మన్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్‌డిఒ రత్నాకల్యాణి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, అసోసియేట్ పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్ధతు ధర కోసం సిసిఐతో సర్కారు సమన్వయం

- అక్టోబర్ నుంచే పత్తి సేకరణ మొదలు
- అవసరమున్న చోట కొత్త కొనుగోలు కేంద్రాలు
- అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పత్తి రైతులకు కనీస మద్దతు ధర అందేలా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ)తో సమన్వయం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాల సహాయ, సహకారాలుంటాయని భరోసా ఇచ్చారు. దేశంలోనే తెలంగాణ పత్తి నాణ్యతకు మారుపేరని వివరించారు. ప్రస్తుతం ఎమ్ఎస్‌పి కంటే క్వింటాల్‌కు రూ.1,099 తక్కువగా ఉందని తెలిపారు. ఈ అంశం రైతులను ఆందోళనకు గురి చేస్తోందని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సిసిఐ ప్రతినిధులు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. పత్తి ఉత్పత్తి, మార్కెట్ ధరల పరిస్థితి, రైతులకు చెల్లింపులు, జిన్నింగ్, ప్రాసెసింగ్ మిల్లుల ఏర్పాట్లు, రవాణా సమస్యలు, డిజిటలైజేషన్, రైతుల రిజిస్ట్రేషన్, స్థానిక కమిటీలు, ఫిర్యాదు పరిష్కారం వంటి అనేక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అక్టోబర్ నుంచే పత్తి సేకరణకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులూ పడకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రాలను 110 నుంచి 122కు పెంచినట్టు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొత్తగా కొనరావుపేటలో సిసిఐ కేంద్రాన్ని కూడా చేర్చాలని సూచించారు. జిన్నింగ్, ప్రాసెసింగ్ మిల్లులు, గోదాములు పత్తి రైతులకు అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎమ్ఎస్‌పి చెల్లింపులు పూర్తిగా ఆధార్ ఆధారిత ధృవీకరణ తర్వాతే నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా రైతులు స్వయంగా స్లాట్ బుక్ చేసుకోవచ్చన్నారు. దీనిపై రైతులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. కౌలు రైతులు కూడా ఒటిపి ఆధారంగా నమోదు చేసుకునే వీలుంటుందన్నారు. అయితే వారి వివరాలు సంబంధిత పట్టాదారు ధ్రువీకరించిన తర్వాతే ఆమోదం పొందుతాయని తెలిపారు. ఈ విధానం వల్ల అర్హత కలిగిన ప్రతి రైతు ఎమ్ఎస్‌పి ప్రయోజనం పొందే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. పత్తి కొనుగోళ్ల సక్రమంగా జరిగేందుకు స్థానికంగా మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇవి తేమ శాతం, నాణ్యత, తూకం, ధరల విషయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా పర్యవేక్షిస్తాయని తెలిపారు. రైతుల ఫిర్యాదుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800 599 5779, వాట్సాప్ హెల్ప్‌లైన్ 88972 81111 కొనసాగుతాయని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రం, జిన్నింగ్, ప్రాసెసింగ్ మిల్లుల్లో సిసి కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కోరారు. రోజువారీ క్రయ, విక్రయాలను పరిశీలించేందుకు వ్యవసాయ కమిషనర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ సెంటర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. గోదాముల నుంచి మిల్లులకు పత్తి రవాణాలో ఆటంకాలు రాకుండా రవాణా శాఖ, జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

పశువైద్య విభాగం అభివృద్ధికి విద్యార్థులు తోడ్పడాలి

- పశుసంపద సంక్షేమానికి కృషి చేయాలి
- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- ఘనంగా వెటర్నరీ విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పట్టభద్రులైన పశువైద్య విద్యార్థులు పశువైద్య విభాగం అభివృద్ధికి, పశుసంపద సంక్షేమానికి తోడ్పడాలని రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో పివి నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవం నిర్వహించగా.. గవర్నర్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ బిడ్డ, మాజీ ప్రధాని పివి నర్సింహారావు పేరుమీద ఏర్పాటు చేసిన ఈ విశ్వవిద్యాలయం ఐదవ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించడం గర్వకారణంగా ఉందన్నారు. ఆయన ఆదర్శాలు విశ్వవిద్యాలయాన్ని ఎల్లప్పుడూ సన్మార్గంలో నడిపిస్తుంటాయని తెలిపారు. ముందుగా ఈ అద్భుత మైలురాయిని చేరుకున్నందుకు పట్టభద్రులైన విద్యార్థులందరినీ అభినందించారు. ఇది విద్యార్థుల విద్యా ప్రయాణం ముగింపును కాక కొత్త ఆరంభానికి నాందిని సూచిస్తుందన్నారు. పశువైద్యులు జంతువుల ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా ప్రజారోగ్యం, పర్యావరణం మధ్య వారధిగా నిలుస్తారని తెలిపారు. డైరీ టెక్నాలజిస్టులు, పోషకాహారంలో ఆవిష్కరణలు, మన ఆహారం సురక్షితంగా, స్థిరంగా ఉండేలా చూసుకుంటారని చెప్పారు. మత్స్య నిపుణులు మన జల వనరుల సంరక్షకులు, సంప్రదాయాన్ని సాంకేతికతతో మిళితం చేస్తూ ఆహార భద్రతకు తోడ్పడుతున్నారని వివరించారు. అనంతరం జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి బోర్డు గుజరాత్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా.మీనేష్ షా మాట్లాడుతూ.. పివి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ప్రసంగించడం గర్వకారణంగా ఉందన్నారు. ముందుగా గ్రాడ్యుయేట్లు, పోస్ట్‌గ్రాడ్యుయేట్లు, డాక్టోరల్ పట్టా గ్రహీతలకు అభినందనలు తెలిపారు. విద్యార్థుల కృషి, అంకిత భావంతో పాటు కుటుంబ సభ్యులు, అధ్యాపకుల సహకారాన్ని కూడా ప్రశంసించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి డా॥ ప్రొ. ఎం. జ్ఞానప్రకాష్ మాట్లాడుతూ.. యూనివర్సిటీ సాధించిన విజయాలు, పశువైద్య విద్య, పరిశోధన, విస్తరణ సేవల్లో నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఉన్న నిబద్ధతను వివరించారు. ఈ స్నాతకోత్సవంలో 2023 జనవరి 1 నుంచి 2024 డిసెంబర్ 31 వరకు పట్టభద్రులైన మొత్తం 524 మందికి గవర్నర్ పట్టాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఉన్నతాధికారులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి రూ. 35 వేల కోట్లు అవాస్తవం

- మంత్రి ఉత్తమ్ కౌంటర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి రూ.35 వేల కోట్లు, సాగులోకి 4.47 లక్షల ఆయకట్టు అంటూ బిఆర్ఎస్ నేత హరీష్‌రావు చేస్తున్న ప్రచారంలో ఎంత మాత్రం నిజం లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖమంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తుమ్మిడిహట్టి దగ్గర బ్యారేజ్ నిర్మించాలని, చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం పనులను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మాట వాస్తవమేనని అంగీకరించారు. ఈ మేరకు శుక్రవారం డా.బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి మీడియాకు మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. హరీష్‌రావు ప్రకటనలు పూర్తిగా నిరాధారమైనవని, ఆయన మాటలు సత్యదూరమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఇప్పటి వరకు బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన అంచనాల ప్రక్రియనే మొదలు పెట్టలేదని, అలాంటప్పుడు హరీష్‌రావు ఇవీ అంచనాలు అంటూ ఎలా నిర్ధారణకు వచ్చారని ప్రశ్నించారు. అన్నింటికీ అతితెలివితేటలు వినియోగిస్తే ప్రజా క్షేత్రంలో అభాసు పాలవుతారని చెప్పారు. ఇటువంటి ప్రకటనల పట్ల తెలంగాణ సమాజం అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఎకో టూరిజం హబ్‌గా తెలంగాణ

- నీలాద్రి అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలి
- రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- సచివాలయంలో ఎకో టూరిజం స్క్రీనింగ్ కమిటీ భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ, అంతర్జాతీయ పర్యాటక రంగంలో తెలంగాణను ఎకో టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. గుర్తించిన సైట్లలో అభివృద్ధి పనులపై కసరత్తు జరుగుతున్నదని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఎకోటూరిజం ప్రాజెక్టు స్క్రీనింగ్ కమిటీ సమావేశం మంత్రి సురేఖ అధ్యక్షతన జరిగింది. అందులో ఎఫ్‌డిసి చైర్మన్ పొదెం వీరయ్య, అటవీ శాఖ ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ (హెచ్ఒఎఫ్ఎఫ్) డాక్టర్ సువర్ణ, తెలంగాణ ఎఫ్‌డిసి ఎండి సునీత భగవత్, పిసిసిఎఫ్ (వైల్డ్ లైఫ్)



ఏలూ సింగ్ మేరు, సిపిఎఫ్ డాక్టర్ జి. రామలింగం (సోషల్ ఫారెస్టు), పలు జిల్లాల డిఎఫ్ఒలు, ఆర్థిక శాఖ సహ ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ స్క్రీనింగ్ కమిటీ భేటీలో అనంతగిరి (వికారాబాద్), కనకగిరి (ఖమ్మం), నందిపేట్ (నిజామాబాద్), మన్ననూర్ జంగల్ రిసార్టు (నాగర్ కర్నూల్), ఎకో పార్కు (నల్లగొండ), వైజాగ్ కాలనీ(నల్లగొండ), మంజీరా (సంగారెడ్డి), అమరగిరి (నాగర్ కర్నూల్) తదితర ప్రాంతాల్లో ఎకో టూరిజం ప్రాజెక్టు అమలుపై సుదర్ఘీ చర్చ జరిగింది. వికారాబాద్ అనంతగిరి హిల్స్ మొదటి దశ పనులు పూర్తయ్యాయనీ, రెండో దశలో కారవాన్ క్యాంపింగ్, ఎకో కాటేజీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన విషయాన్ని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఖమ్మంలోని కనకగిరి ప్రాజెక్టు పనులు అక్టోబర్ 2025 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. నల్లగొండ ముచ్చర్ల ఎకో పార్క్, నైట్ సఫారీ, వీఆర్ పార్క్, డైనోసార్ పార్క్ వంటివి రూపకల్పన చేసినట్టు వివరించారు. సంగారెడ్డిలోని మంజీరా వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో భూసేకరణ, భూమి కేటాయింపు సమస్యల పరిష్కారం పెండింగ్‌లో ఉందన్నారు. ఎక్కడికక్కడ ఆయా ఎకో టూరిజం సెంటర్లలో స్థానిక గిరిజనులు, ఇతర ప్రాంతాల ప్రజల ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సాంప్రదాయాల ప్రకారం ఎకో టూరిజం ప్రాజెక్టులను అమలు చేయాలని మంత్రి సురేఖ సూచించారు. దేవాలయాలున్న ప్రాంతాల్లో ఆధ్యాత్మిక పద్ధతిలో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. మధ్యప్రదేశ్‌లోని భీమ్‌బెక్కా కొండల తరహాలో నీలాద్రి కొండలపై ప్రాచీన కాలం నాటి గుర్తులున్నందున ఎకో టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్నారు. అవసరమైన నిధులను పర్యాటక, దేవాదాయ శాఖల నుంచి తీసుకోవాలని సూచించారు.

చేనేత కార్మికురాలి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అప్పుల బాధ తాళలేక.. చేనేత కార్మికురాలు ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శుక్రవారం నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ ఎం.సంజీవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన అప్పం యాదమ్మ (58) చేనేత వృత్తి చేసేది. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ మానసికంగా కుంగిపోయింది. గురువారం రాత్రి ఇంట్లోని బాత్రూంలో ఉరేసుకుంది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

వేధింపులకు పాల్పడుతున్న భర్త హత్య

- కోకాపేటలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాగుడుకు బానిసై నిత్యం వేధింపులకు గురిచేస్తుండడంతో భర్తను భార్య హత్య చేసిన ఘటన రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీసుస్టేషన్ పరిధిలోని కోకాపేటలో శుక్రవారం జరిగింది. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అసోంకి చెందిన దంపతులు బరాక బోర, కృష్ణజ్యోతి బోర (35) హైదరాబాద్‌కు వలస వచ్చారు. కార్మికులుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. తాగుడుకు బానిసైన భర్త కొద్ది రోజులుగా భార్యను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. దాంతో విచక్షణ కోల్పోయిన భార్య కూరగాయలు కట్ చేసే కత్తితో భర్తపై దాడి చేసింది. గమనించిన స్థానికులు వెంటనే భర్తను ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. కృష్ణజ్యోతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. నిందితురాలని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

స్కూల్ బస్సు కింద పడి బాలుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాఠశాలకు వెళ్లేందుకు రోడ్డు దాటుతూ ప్రమాదవశాత్తు స్కూల్ బస్సు కింద పడి బాలుడు మృతి చెందిన ఘటన నల్లగొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రంలోని రంగప్పకాలనీలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లా పెద్దకడబూరు మండలం, కంబాలదిన్నె గ్రామానికి చెందిన కుమ్మరి చంద్రశేఖర్ భార్య, ఇద్దరు కుమారులతో కలిసి పెద్దవూరలోని రంగప్పకాలనీలో నివాసముంటున్నారు. వారి పెద్ద కుమారుడు గౌతమ్ చక్రశాలి (7) శాంతినికేతన్ పాఠశాలలో యూకేజీ చదువుతున్నాడు. గురువారం ఉదయం 8:30 గంటల సమయంలో గౌతమ్ స్కూల్ బస్సు ఎక్కేందుకు రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో డ్రైవర్ భాషపాక అశోక్ గమనించకుండా ముందుకు పోనివ్వడంతో గౌతమ్ బస్సు కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన విద్యార్థిని నాగార్జునసాగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నల్లగొండ నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీనిపై శుక్రవారం బాలుని తండ్రి చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌స్టామార్ట్ క్విక్ ఇండియా సేల్ షురూ

న్యూఢిల్లీ : క్విక్ ఇ-కామర్స్ వేదిక ఇన్‌స్టామార్ట్ తన క్విక్ ఇండియా మూవ్‌మెంట్ 2025 సేల్‌ను సెప్టెంబర్ 19 నుంచి ప్రారంభించినట్లు తెలిపింది. దీన్ని 28 వరకు కొనసాగించనున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. ఇందులో 50,000 పైగా ఉత్పత్తులపై 50-90 శాతం వరకు తగ్గింపును పొందవచ్చని పేర్కొంది.

ఈ సేలలో వినియోగదారులకు అద్భుతమైన ఆదాలను, మెరుపు వేగంతో డెలివరీని, పండుగ ఉత్సాహాన్ని అందిస్తామని.. అన్నీ 10 నిమిషాల్లోలి డెలివరీ చేయబడతాయని ఇన్‌స్టామార్ట్ సిఇఒ అమితేష్ ఝా తెలిపారు.

ప్రభుత్వ విధానాల ఫలితమే వ్యవసాయ సంక్షోభం

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మన దేశంలో మూడింట రెండొంతుల జనాభాకు ఆధారంగా ఉన్న వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని, దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే కారణమని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. శుక్రవారం వరంగల్‌లో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులను సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి ప్రారంభించారు. తరగతులకు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు.

ఈ సందర్భంగా పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. సరళీకరణ ఆర్థిక విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక మార్పులను వేగవంతం చేయడంలో విఫలం చెందాయన్నారు. వ్యవసాయంలో అతి తక్కువ వృద్ధిరేటు ఉన్న కారణంగా సగానికి పైగా వ్యవసాయ కుటుంబాలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నాయని, దాంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల కొనుగోలు శక్తి బాగా తగ్గిందని తెలిపారు. దేశంలో వ్యవసాయ సంస్కరణలు, గ్రామీణ వ్యవసాయ నిర్మాణంలో ప్రభుత్వ పెట్టుబడుల కొరత వల్ల వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

ఫలితంగా ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ గ్రామీణ అసమానతలు ఉన్న దేశాల్లో మన దేశం ఒకటిగా ఉంది. చిన్న, సన్నకారు రైతులకు అందాల్సిన ఆర్థిక వనరులను ధనిక వర్గాలకు, బడా కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వాలు మళ్ళించాయని తెలిపారు. ప్రస్తుతం రైతాంగం ఎదుర్కొంటున్న సంక్షోభానికి, గత మూడు దశాబ్దాలుగా నిరంతరాయంగా అమలవుతున్న నయా ఉదారవాద విధానాలే ప్రధాన కారణమన్నారు. దాంతో ఏర్పడిన తీవ్ర వ్యవసాయ సంక్షోభం, లక్షలాది మంది రైతుల ఆత్మహత్యలకు దారి తీసిందని తెలిపారు. పెట్టుబడికి అయిన ఖర్చుకు అదనంగా యాభై శాతం కలిపి మద్దతు ధరగా హామీ ఇవ్వాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలను పూర్తిగా రద్దు చేయాలని, సన్న-చిన్నకారు రైతులకు తక్కువ వడ్డీతో రుణ సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఉపాధి హామీ చట్టం కింద వ్యవసాయ కార్మికులకు రెట్టింపు పని దినాలు, రెట్టింపు వేతనాలను అమలు చేయాలని కోరారు. గిరిజన రైతులకు అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలని, రైతుల నుంచి బలవంతంగా భూసేకరణను నిలిపి వేయాలని, భూ సంస్కరణలను చేపట్టాలని కోరుతూ పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, డి. బాల్ రెడ్డి, మాటూరి బాలరాజుగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాదినేని రమేష్, బుర్రి శ్రీరాములు, శెట్టి వెంకన్న, వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పుచ్చకాయల కృష్ణారెడ్డి, ఈసంపల్లి బాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లో అద్దెలకు భలే డిమాండ్

- వచ్చే ఏడాదిలో ఎఎస్‌బిఎల్ లాఫ్ట్ ప్రాజెక్టు పూర్తి
- ఆ సంస్థ ఫౌండర్, సిఇఒ అజితేష్ కొరుపోలు వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్



నగరంలో ప్రముఖ వ్యాపార కేంద్రంగా మారుతోన్న ఫైనాన్సియల్ డిస్ట్రిక్‌లో నివాసాలకు, అద్దెలకు భారీగా డిమాండ్ పెరుగుతోందని ప్రీమియం రియల్ ఎస్టేట్ కంపెనీ ఎఎస్‌బిఎల్ వ్యవస్థాపకులు, సిఇఒ అజితేష్ కొరుపోలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అజితేష్ మాట్లాడుతూ.. గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25లో ఫైనాన్సియల్ డిస్ట్రిక్‌లో 3 గదుల నివాసాల అద్దెలు ఏకంగా 25.7 శాతంగా పెరిగాయన్నారు. పెట్టుబడులపై రాబడి 4-6 శాతానికి చేరుకుందని.. ఇది హైదరాబాద్‌లోని సగటు రాబడి 2-3 కంటె రెట్టింపు అని తెలిపారు. ఈ ప్రాంతంలో తమ సంస్థ నిర్మిస్తోన్న ఎఎస్‌బిఎల్ లాఫ్ట్ ప్రాజెక్టుకు విశేష స్పందన లభిస్తోందన్నారు. 5 ఎకరాల్లో జి ప్లస్ 45 ఫ్లోర్లలో 856 నివాసాలతో అందుబాటులోకి తెస్తోన్న ఈ ప్రాజెక్టును 2025 డిసెంబర్ కల్లా పూర్తి చేసి వినియోగదారులకు అందించనున్నామని చెప్పారు. 1700-1900 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫ్లాట్లను నిర్మిస్తున్నామని చెప్పారు. చదరపు అడుగు ధరను రూ.11000గా నిర్ణయించామన్నారు. ఈ ప్రాజెక్టు స్థలానికి రూ.250 కోట్లు, అభివృద్ధికి మరో రూ.250 కోట్లను వెచ్చిస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో వచ్చే రెండు, మూడేళ్లలో ఇక్కడ 90వేల నుంచి లక్ష ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. దాదాపు 26 వేల మంది ఉద్యోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి గూగుల్‌కు చెందిన 33 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త క్యాంపస్ రానుందన్నారు. మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఆపిల్, టిసిఎస్ తమ క్యాంపస్‌లను విస్తరిస్తున్నాయన్నారు.

వెంకట్రామిరెడ్డి ఎమ్మెల్సీ ఎన్నిక పిటిషన్‌లో వివరాలేవి? : హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్సీగా పి.వెంకట్రామిరెడ్డి నామినేషన్ దాఖలుకు ఒక రోజు ముందు ఐఎఎస్ పదవికి రాజీనామా చేశారని, కేంద్రం రాజీనామాను ఆమోదించకుండానే ఎమ్మెల్సీగా నామినేషన్ వేసి ఎన్నికయ్యారంటూ దాఖలైన పిటిషన్‌లో ఆ వివరాలు లేకపోవడాన్ని హైకోర్టు గుర్తించింది. రాజీనామా చేశారా, స్వచ్ఛంద పదవీ విరమణ చేశారా వంటి వివరాల్లేకుండా పిటిషన్ వేయడాన్ని ప్రశ్నించింది. ఐఎఎస్ పదవికి రాజీనామా ఆమోదించాలని ప్రభుత్వానికి చేసుకున్న వినతి పత్రం లేకుండా పిటిషన్ ఎలా వేస్తారని ప్రశ్నించింది. పూర్తి వివరాలతో అదనపు పిటిషన్ వేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. విచారణను 3 వారాలకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ఎకె సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్లతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఆదేశించింది.

'ఐఎఎస్ పదవికి రాజీనామాను కేంద్రం ఆమోదించకుండానే ఎమ్మెల్సీగా నామినేషన్ వేయడం చెల్లదు. ఎమ్మెల్సీ పదవిపై అనర్హులు. ఈ మేరకు ఇసికి, మండలి ఛైర్మన్‌కు ఆదేశాలివ్వాలి' అని కరీంనగర్‌కు చెందిన జె.శంకర్ ఇతరులు పిటిషన్లు వేశారు. 'ఎమ్మెల్సీ రాజీనామాను సిఎం ఒత్తిడితో సిఎస్ ఆమోదించారు. నిజానికి కేంద్రం ఆమోదం చెప్పాలి.

నోటీసు ఇచ్చాక గడువు తీసుకున్నాక కేంద్రం ఆమోదించాలి. ఇవేమీ చేయకుండా రాష్ట్రం ఆమోదించడం చెల్లదు' అని పిటిషనర్ లాయర్ చెప్పారు. రాజీనామా ఆమోదించినట్టుగా రాష్ట్ర ప్రభుత్వం జిఒ ఇచ్చిందని, దీని మేరకే ఎమ్మెల్సీ నామినేషన్ అనుమతిచ్చినట్టు ఈసి కౌన్సెల్ చెప్పారు. పిటిషనర్ వివరాల కోసం విచారణ వాయిదా పడింది.

కెసిఆర్ రాజకీయ వ్యవస్థను భ్రష్టు పట్టించారు

- బిఆర్ఎస్ హయాంలో వేరే పార్టీ ఎమ్మెల్యేలు 32 మందిని చేర్చుకోలేదా?
- అప్పుడు ఎందుకు రాజీనామాలకు డిమాండ్ చేయలేదు
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ రాజకీయ వ్యవస్థను భ్రష్టు పట్టించారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్ర విమర్శలు గుప్పించారు. శుక్రవారం హన్మకొండలోని నక్కలగుట్ట హరిత కాకతీయలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇతర పార్టీలకు చెందిన 36 మంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకున్నారని, అందులో ఇద్దరికి మంత్రి పదవులు ఇచ్చారని, అప్పుడు రాజీనామాలు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. వాళ్లు చేస్తే సంసారం, ఇప్పుడు వేరేవాళ్లు చేస్తే వ్యభిచారమా అంటూ విమర్శించారు. సభ్యత, సంస్కారం మరవొద్దని, కొంతమంది స్థాయిని మరిచి వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎప్పుడూ పదవులు అడగలేదని, కెసిఆర్ స్వయంగా ఢిల్లీ నుంచి పిలిచి డిప్యూటీ సిఎం పదవి ఇచ్చారని అన్నారు. తాను భూ కబ్జాలు, అవినీతి చేయలేదని ఎప్పుడూ స్వార్థం కోసం పని చేయలేదని తెలిపారు. తన దృష్టి ఎల్లప్పుడూ నియోజకవర్గ అభివృద్ధిపైనే ఉందని చెప్పారు. 'ప్రజల చేత, పార్టీల చేత తిరస్కరించబడిన వ్యక్తివి నువ్వని, ప్రజలు, పార్టీలు తిరస్కరించిన వ్యక్తి ఇప్పుడు ఆరోపణలు చేయడం విచిత్రమని అన్నారు. ఎవరెన్ని వ్యక్తిగత దూషణలు చేసినా తాను వెనుకడుగు వేయలేనని, ప్రజల అభివృద్ధికే కట్టుబడి పని చేస్తానని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధే తన ఎజెండా అని, ప్రజలకిచ్చిన హామీ మేరకే కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని అన్నారు.

గత 21 నెలల్లోనే నియోజకవర్గానికి రూ.1025 కోట్ల అభివృద్ధి పనులు మంజూరైనట్టు శ్రీహరి వివరించారు. దేవాదుల ఉప కాల్వలు మరమ్మతు చేసి చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందజేసినట్టు తెలిపారు. రూ.1015కోట్లతో 3వ దశ పనులు పూర్తవుతాయని, 4 నియోజకవర్గాల్లో 78వేల ఎకరాలకు సాగునీరు చేరుతుందని, ప్రతి గ్రామానికి గోదావరి జలాలు వచ్చే ఏడాదిలోపు అందిస్తామని, రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైనట్టు తెలిపారు. రూ.45.50 కోట్లతో 100 పడకల ఆస్పత్రి, అనేక సబ్‌స్టేషన్లు నిర్మాణంలో ఉన్నట్టు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే ఇంత పెద్ద మొత్తంలో అభివృద్ధి నిధులు లభ్యమయ్యాయని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రిబుల్‌ఆర్ బాధితులకు అండగా ఉంటాం కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్, నారాయణపురం మండలాల్లో రీజినల్ రింగ్‌రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు అండగా ఉంటామని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. శుక్రవారం త్రిబుల్‌ఆర్ బాధితులు డబ్బేటి రాములుగౌడ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కలిశారు.

భూములు కోల్పోతున్న తీరును కెటిఆర్‌కు వివరించారు. గత అలైన్‌మెంట్ ప్రకారం ఔటర్ రింగ్‌రోడ్డుకు 40 కిలోమీటర్ల నుంచి ఉండగా.. కొంతమంది వ్యాపారస్తుల ప్రయోజనాల కోసం చౌటుప్పల్ మున్సిపాలిటీ ప్రాంతంలో 28 కిలోమీటర్లకు అలైన్‌మెంట్‌ను తగ్గించారని వివరించారు. దీనిపై కేటీఆర్ మాట్లాడుతూ.. బడా పారిశ్రామికవేత్తల కోసం భూములు లాక్కునిసీఎం రేవంత్‌రెడ్డి రైతులను బలి చేస్తున్నారని, త్రిబుల్‌ఆర్ బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారని రైతులు తెలిపారు. కెటిఆర్‌ను కలిసిన వారిలో త్రిబుల్ ఆర్ బాధితుల వెంట మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కార్పొరేషన్స్ మాజీ చైర్మెన్లు పల్లె రవికుమార్‌గౌడ్, దూదిమెట్ల బాలరాజుయాదవ్, సర్పంచుల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్ ఉన్నారు.



గ్లో బై కీర్తిలాల్స్‌కు 'రిటైల్ జ్యువెలర్స్ గిల్డ్' అవార్డు

హైదరాబాద్ : వజ్రాభరణాల రిటైల్ చెయిన్ గ్లో బై కీర్తిలాల్స్ పరిశ్రమలో ప్రతిష్టాత్మక అవార్డును దక్కించుకున్నట్లు తెలిపింది. రిటైల్ జ్యువెలర్స్ గిల్డ్ అవార్డ్స్ 2025లో "ఎక్సలెన్స్ ఇన్ డిజైన్ - కలర్ స్టోన్ ఇయర్ రింగ్స్" విభాగంలో ఈ గుర్తింపు లభించిందని ఆ సంస్థ పేర్కొంది. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన అవార్డు వేడుకలో వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన డాక్టర్ ఆర్ అరుణా నందన్ చేతుల మీదుగా కీర్తిలాల్స్ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ దీన్ని అందుకున్నారని ఆ సంస్థ పేర్కొంది.

అక్టోబర్ ఆఖరికి సనత్‌నగర్ టిమ్స్ పనులు పూర్తి

- అధికారులకు మంత్రి దామోదర ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సనత్‌నగర్ టిమ్స్ పనులను అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని రోడ్లు, భవనాలశాఖ అధికారులను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. హాస్పిటల్ ప్రారంభించిన రోజు నుంచే ప్రజలకు వైద్య సేవలందించేలా అవసరమైన ఎక్విప్‌మెంట్, ఫర్నీచర్ అన్నీ ముందే సమకూర్చుకోవాలని హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తుకు మంత్రి సూచించారు. డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందిని నియమించుకోవాలని డిఎంఇ డాక్టర్ నరేంద్ర కుమార్‌ను ఆదేశించారు. ఈ మేరకు సనత్‌నగర్, ఎల్బీనగర్, కొత్తపేట్ టిమ్స్ హాస్పిటళ్లు, నిమ్స్ హాస్పిటల్ విస్తరణ ప్రాజెక్ట్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మెడికల్ కాలేజీల నిర్మాణ పనులపై శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో గల తన చాంబర్‌లో ఆర్ అండ్ బి, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. సనత్‌నగర్ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయనీ, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్‌ల పనులు మరో 6 నెలల్లో పూర్తవుతాయని అధికారులు మంత్రికి వివరించారు.

సనత్‌నగర్ టిమ్స్‌ను ఈ ఏడాది చివరిలో ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సిఎం రేవంత్‌రెడ్డి సూచించిన విషయాన్ని ఈ సందర్భంగా అధికారులకు మంత్రి గుర్తు చేశారు. అక్టోబర్ చివరి నాటికల్లా అన్ని పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బి, వైద్యారోగ్యశాఖ అధికారులు సమన్వయంతో పని చేసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు ఆలస్యం కావొద్దన్నారు. ఎక్విప్‌మెంట్, ఫర్నీచర్ కొనుగోలు విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, డయాగ్నస్టిక్ ఎక్విప్‌మెంట్స్ అన్నీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో కూడినవే కొనుగోలు చేయాలని సూచించారు. సంబంధిత డిపార్ట్‌మెంట్ డాక్టర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. నిమ్స్ విస్తరణ ప్రాజెక్టు పనులపై మంత్రి ఆరా తీశారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్‌కు హాస్టల్ సదుపాయం కూడా అక్కడే ఉండాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మహబూబాబాద్, మంచిర్యాల, జనగాం, వనపర్తి మెడికల్ కాలేజీ భవనాలను మరో 2 నెలల్లో అప్పగిస్తామని ఆర్‌అండ్‌బి అధికారులు వెల్లడించారు. మరో 8 నెలల్లో మిగిలిన కాలేజీల పనులను పూర్తి చేస్తామని తెలిపారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను మంత్రి ఆదేశించారు. సమావేశంలో టిజిఎంఎస్ఐడిసి ఎమ్‌డి ఫణీంద్రరెడ్డి, ఆర్‌అండ్‌బి సిఇలు రాజేశ్వర్‌రెడ్డి, లింగారెడ్డి, ఇతర అధికారులు, ఆయా భవనాలు నిర్మిస్తున్న కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటిఐల్లో 5 వేల సీట్లను భర్తీ చేయాలి

- ఎటిసి పేరుతో సంప్రదాయ ట్రేడ్లపై నిర్లక్ష్యం తగదు
- విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలి
- జెడి నగేష్‌కు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ ఐటిఐల్లో ఐదు వేల సీట్లను వెంటనే భర్తీ చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఐటిఐలో ఈ సంవత్సరం ప్రవేశాలు చేపట్టకుండా నిలిపేయడం సరైంది కాదని తెలిపింది. ఎటిసిల పేరుతో సంప్రదాయ ట్రేడ్లలో ప్రవేశాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేయడం తగదని హెచ్చరించింది. విద్యార్థులకు ఐటిఐల్లో వెంటనే ప్రవేశాలు కల్పించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ జాయింట్ డైరెక్టర్ ఎస్‌వికె నగేష్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రజనీకాంత్, కార్యదర్శి టి.నాగరాజు కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో 64 ప్రభుత్వ ఐటిఐల్లో 4,884 సీట్లు భర్తీ చేయలేదని తెలిపారు. ఫిట్టర్-80 సీట్లు, ఎలక్ట్రికల్-128 సీట్లు, వెల్డర్-640 సీట్లు, టర్నర్-360 సీట్లు, స్టెనోగ్రఫీ-264 సీట్లు, డ్రెస్ మేకింగ్-320 సీట్లు, కోపా-912 సీట్లు, సివిల్-1,632 సీట్లు, ఎంఎంవి-120 సీట్లు, మెకానిస్ట్-168 సీట్లు, వుడ్ వర్క్- 24 సీట్లు, మెకానిక్ గ్రైండర్-80 సీట్లు, డీజిల్ మెకానిక్-48 సీట్లు, ఇన్‌స్ట్రుమెంట్-178 సీట్లు తదితర ట్రేడ్లలో మొత్తం 4,884 సీట్లకు ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్లు భర్తీ చేయలేదని పేర్కొన్నారు. ఏటీసీ పేరుతో ఉపాధి కల్పన అంటూ వేరే కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. రాష్ట్రంలో ఒకేసారి 4,884 పైగా సీట్లకు కొత పెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో చాలా కళాశాలల్లో అన్ని ట్రేడ్లలో కనీసం ఒక్క అడ్మిషన్ కూడా నింపలేదని వివరించారు. దీని వల్ల ప్రయివేట్ కళాశాలలకు అవకాశం ఇచ్చి వాటిలో ఈ ట్రేడ్‌లను కొనసాగిస్తున్నారని విమర్శించారు.ప్రభుత్వ ఐటీఐల్లో ఈ ట్రేడ్లలో ప్రవేశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎటిసిలను తీసుకొచ్చి ప్రయివేట్ సంస్థ టాటాకు అప్పజెప్పి రాష్ట్రంలో ప్రభుత్వ ఐటిఐల్లో సీట్లు నింపకపోవడం దుర్మార్గపు చర్య అని విమర్శించారు. డిమాండ్ ఉన్న స్టెనోగ్రఫీ, డ్రెస్ మేకింగ్, ఫిట్టర్, ఎలక్ట్రికల్, టన్నర్, వెల్డర్ వంటి కోర్సుల్లో ప్రవేశాల కోసం కనీసం నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని తెలిపారు. ఈ ట్రేడ్లలో సీట్లను భర్తీ చేయాలని కోరారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు లెనిన్ గువేరా, హైదరాబాద్ జిల్లా నాయకులు కైలాష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్మట్టి ఎత్తు పెంపుతో తెలంగాణకు మరణశాసనం

- రైతు వ్యతిరేక కాంగ్రెస్‌పై మహోద్యమ నిర్మాణం
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్


కార్యక్రమంలో మాట్లాడుతున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆల్మట్టి ఎత్తు పెంపుతో తెలంగాణకు కర్ణాటక కాంగ్రెస్ మరణశాసనం రాసి దక్షిణ తెలంగాణను ఎడారిగా మార్చే కుట్ర చేస్తుంటే సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో జల్సాలు చేస్తున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. దాని ఎత్తు పెరిగితే కృష్ణా జలాల్లో తెలంగాణ శాశ్వతంగా హక్కు కోల్పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టులో కేసుండగా కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గపు నిర్ణయం తీసుకుంటే రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారు? మహారాష్ట్ర సిఎం స్పందించినా రేవంత్‌కు చలనం రాదా? 5 ఫీట్ల పెంచడానికే రూ.70 వేల కోట్ల ఖర్చు చేస్తుంటే, 40 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.93 వేల కోట్ల ఖర్చు చేయడంలో తప్పేం ఉంది? అని కెటిఆర్ ప్రశ్నించారు.

ఆల్మట్టి డ్యాం ఎత్తును 519 అడుగుల నుంచి 524 అడుగులకు పెంచాలని కర్ణాటక మంత్రిమండలి నిర్ణయం తీసుకుని మూడు రోజులైనా రేవంత్ రెడ్డికి చలనం లేదని విరుచుకుపడ్డారు. కేవలం 100 టిఎంసిల కోసమే ఆల్మట్టి ఎత్తు పెంచడం లేదనీ, కృష్ణా జలాల్లోని తెలంగాణ హక్కును బొందపెట్టి ఉమ్మడి మహబూబ్ నగర్, నల్గొండ, రంగారెడ్డిలను ఎడారులుగా మార్చేందుకు కర్నాటక కాంగ్రెస్ కుట్ర పన్నిందని ఆరోపించారు. ఈ కుట్రపై ముఖ్యమంత్రి రేవంత్‌తో పాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జాతీయ పార్టీకి జాతీయ విధానం ఉండాలని సూచించారు. కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రను వెంటనే అడ్డుకోకపోతే రైతులతో కలిసి మహెూద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.

ఆల్మట్టి ఎత్తు పెంచితే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఎందుకు పనికిరాకుండా పోతుందని కెటిఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ హయాంలో 90 శాతం పనులు పూర్తైన పాలమూరు రంగారెడ్డి పథకం నిర్వీర్యమవుతుంటే రేవంత్ చూస్తూ ఊరుకోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతేకాదు కర్నాటక నుంచి కృష్ణా నీళ్ల రాకపోతే జూరాలే నిండదన్న కెటిఆర్, రేవంత్ మొదలుపెట్టిన నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం కూడా పడావు పడుతుందని హెచ్చరించారు.

ఆల్మట్టి ఎత్తు పెంపు ఖర్చుతో కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేసిన అవినీతి ఆరోపణలను కెటిఆర్ తిప్పికొట్టారు. కేవలం ఐదు అడుగుల ఎత్తు పెంచేందుకు అవసరమైన భూసేకరణ కోసమే రూ.70 వేల కోట్లు ఖర్చు చేయడంతో పాటు లక్షా 30 వేల ఎకరాలను భూమిని సేకరిస్తున్నామని కర్ణాటక ప్రభుత్వం చెపుతుందని తెలిపారు. మరి ఐదు అడుగుల భూసేకరణకే అంత ఖర్చయితే, మూడు బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్ స్టేషన్లు, 21 పంపింగ్ స్టేషన్లు, 203 కిలోమీటర్ల టన్నెల్స్, 1,700 కిలోమీటర్ల కాలువలు, 40 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.93 వేల కోట్ల ఖర్చు చేయడంలో తప్పేం ఉందని ప్రశ్నించారు.

ఎంపి లాడ్స్‌పై సమీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో పార్లమెంటు సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం సమీక్ష కోసం జోనల్ వర్క్‌షాప్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాలు ప్రణాళిక అమలు మంత్రిత్వశాఖ సహకారంతో, దక్షిణాది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అధికారులతో పాటు, తెలంగాణ రాష్ట్రంలోని అందరూ ముఖ్య ప్రణాళిక అధికారులు ఇందులో పాల్గొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం ఇందుకు వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఎంపి లాడ్స పథకానికి సంబంధించిన అన్ని ముఖ్యాంశాలను అధికారులకు ప్రత్యేక శిక్షణ ద్వారా ముఖ్యంగా ఇ-సాక్షి పోర్టల్ యొక్క నిర్వహణను కవర్ చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా మ్యాపింగ్ చేయడం తద్వారా అధికారులు డిజిటల్ ప్రక్రియను మెరుగ్గా అర్థం చేసుకోవడంతో పాటు, సందేహాలను వెంటనే పరిష్కరించే అవకాశం ఉంటుంది. ఈ కార్యక్రమాన్ని ప్రణాళికా శాఖ డైరక్టరు రూపస్‌దత్తం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పూజాసింగ్ మండోల్, గణాంక, ప్రణాళిక అమలు మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి జోసెఫ్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ శిక్షణను ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమానికి, కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక అమలు మంత్రిత్వశాఖ అధికారులు, రాష్ట్ర ప్రణాళికాశాఖ అధికారులు పాల్గొన్నారు.

మిడ్డే మీల్ మెనూ ఏమిటో చెప్పండి : హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో పెట్టే ఆహార మెనూ తెలియజేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మెనూ ప్రకారం పెట్టే ఆహారం ఏమిటి, న్యూట్రిషన్ ఆహారం ఉందా, ఒక్కో విద్యార్థికి ఎంత డబ్బు కేటాయింపు, దీనిని పెంపుదల చేశారా వంటి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలంది. చీఫ్ జస్టిస్ ఎకె సింగ్, జస్టిస్ మొహియుద్దీన్లతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. అఖిల్ శ్రీగురుతేజ వేసిన పిల్‌పై విచారణను 3 వారాలకు వాయిదా వేసింది.